ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పనులపై ఈఈ ఎస్ లోకేశ్వరరావు, డీఈ రమణ, జేఈ మూర్తితో ఆయన శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. అధికారుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనేకచోట్ల రోడ్లకు మరమ్మతులు చేయడంతో పాటుగా కొన్ని చోట్ల కొత్తగా రోడ్డు పనులు చేపట్టారని చెప్పారు. ఈ పనుల వేగవంతంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వం రోడ్లను నిర్లక్ష్యం చేయడంతోపాటు చేపట్టిన పనుల్లో నాణ్యత లేకపోవడం వల్ల రోడ్లు ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రోడ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపించడంతో కరోనా అనంతరం రెండేళ్లుగా రోడ్ల పనులు చురుగ్గా కొనసాగుతున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నియోజకవర్గంలోని అన్నిగ్రామాలు, భీమవరం పట్టణంలో మరిన్ని రోడ్లను నిర్మించేందుకు నిధులు మంజూరుచేయించామని వివరించారు.



భీమవరంలో ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



క్విజ్‌పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఇతర రంగాల్లోనూ రాణించాలి

సాక్షి, భీమవరం: విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్వహించిన క్విజ్ పోటీల్లో బహుమతులు సాధించిన స్థానిక సీఎస్ఎన్ కళాశాల ఫార్మసీ విద్యార్థులు టి.శ్యాముల్, ఎస్.రాములు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రఘువీరవర్మ, వైస్ ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాద్, గెద్దం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మవారికి కాసు బంగారం సమర్పణ



ఆలయ అధికారులక బంగారం అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మవారికి శనివారం భీమవరానికి చెందిన చామన వీర వెంకటసత్యనారాయణ సుజాత దంపతులు కాసు బంగారం సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బాబురావు, ధర్మకర్త ముత్యాల రామరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్‌లో అక్రమ తూరలకు చెక్

అనుమతి లేకుండా వంతెన నిర్మాణం

ఆకివీడు: కేజీ రహదారిలో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన రిటైనింగ్ వాల్‌పై అక్రమ వంతెనలు, తూరల ఏర్పాటుకు చేపల, రొయ్యల చెరువుల యజమానులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని పెదకాపవరం, చినకాపవరం గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రహదారి పటిష్టత, శివారు ప్రాంతాల వరకూ సాగు, తాగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని రూ. 22.50 కోట్ల వ్యయంతో చేపట్టి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. అక్రమ తూరల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ ఏర్పాటు చేసిన రిటైనింగ్‌వాల్ రంధ్రాలపై రైతులు, నాయకులు ఆందోళన చేశారు. నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్, ఈఈ, డీఈలకు ఫిర్యాదులు చేశారు. దీంతో శాఖ కింది స్థాయి అధికారి దిగివచ్చి రంధ్రాల్ని పూడ్పిస్తున్నారు. భారీ నిర్మాణంలో రంధ్రాలను ఏర్పాటు చేసి, మళ్లీ పూడ్చడం ద్వారా కాంక్రీట్ పూర్తిగా గట్టిపడే అవకాశం లేదని, నీళ్లలో పనులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వీటికి తోడు రిటైనింగ్ వాల్‌పై ఓ రొయ్యల రైతు నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి లేకుండానే వంతెన నిర్మాణం చేపట్టారు. రైతుల ఆందోళనతో రెండు రోజులు పనులు నిలుపుదల చేసినప్పటికీ శనివారం వంతెన పనుల్ని కొనసాగించారు. నీటిపారుదల శాఖ గణపవరం మండల ఏఈ నిర్లక్ష్య వైఖరి వల్లే ఇటువంటి పనులు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అక్రమ వంతెన నిర్మాణానికి కూడా ఏఈ అనుమతి ఇచ్చారని, ఉన్నతాధికారులు పనుల్ని నిలుపుదల చేయమని ఆదేశించినా పనులు కొనసాగిస్తున్నారని వారు వాపోతున్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పర్యవేక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెదకాపవరం-క్రొవ్విడి రహదారిలో రిటైర్నింగ్ వాల్ పై అక్రమ వంతెన నిర్మిస్తున్న దృశ్యం.



అక్రమ తూరల కోసం రిటైర్నింగ్ వాల్‌కు ఏర్పాటు చేసిన రంధ్రాల్ని పూడ్చివేస్తున్న దృశ్యం.

సమస్యలన్నీ జగనన్న సురక్షతో పరిష్కారం

కాళ్ల: సమస్య ఏదైనా పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారని తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ స్వాతి తెలిపారు. మండలంలోని జక్కరం గ్రామంలో అధికారులు శనివారం పర్యటించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ప్రక్రియను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు అలాగే గ్రామంలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఎంతో మేలు చేకూరుతుందని స్పష్టం చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: జగనన్న సురక్ష కార్యక్రమం మోగల్లు, పాలకోడేరు గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, ఎంఎల్ఓ సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పథకాలు అందేలా జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి సేవా రుసుం లేకుండా 11 రకాల సేవలు ప్రజలకు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్ ఇంగేటి మరియమ్మ, ఎంపీటీసీ సభ్యులు కునాధరాజు వెంకట నాగ,లక్ష్మి, కొత్తపల్లి స్వాతి, పెన్మత్స వెంకటలక్ష్మి కాటూరి శాంతకుమారి, ఆళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జక్కరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

ఆకివీడులో..

ఆకివీడు: అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందకుండా ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే ప్రారంభించారు. మండలంలోని పెదకాపవరం, సిద్ధాపురం గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్ళి లబ్ధిదారులు పొందుతున్న పథకాలతో పాటు, అర్హత ఉండి పథకం పొందకపోతే వారి వివరాలి సేకరించి, నమోదు చేసుకుంటున్నారు. స్థానిక నగర పంచాయతీలోని ఆయా వార్డుల్లో వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో 25, పెదకాపవరం గ్రామంలో 30 ధ్రువపత్రాల కోసం అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ కందుల వాణి చెప్పారు. స్థానిక నగర పంచాయతీలో అర్జీలు రాలేదని కమిషనర్ కృష్ణమోహన్ చెప్పారు.

ఫిల్టర్ బెడ్స్‌లో ఇసుక మార్పిడి

ఆకివీడు: మంచినీటి సరఫరాను మెరుగుపరచేందుకు స్థానిక శాంతినగర్‌లోని ఓహెచ్ఎస్ఆర్ వద్ద ఉన్న రెండు ఫిల్టర్‌బెడ్‌లను గత రెండు రోజులుగా శుభ్రపరుస్తున్నారు. రూ.4,88,659 వ్యయంతో ఫిల్టర్ బెడ్‌లలో కొత్త ఇసుక నింపుతున్నట్లు నగర పంచాయతీ వాటర్ వర్క్స్ ఏఈ రాజు శనివారం చెప్పారు. మరో రెండు రోజుల వరకూ పని ఉంటుందన్నారు. ప్రజలకు మంచినీటి ఇబ్బంది లేకుండా అరగంట సేపు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఫిల్టర్ బెడ్‌లలో పాత ఇసుకను పూర్తిగా బయటకు తీయించివేస్తున్నామన్నారు. ఇటుక, కంకర్లను నీళ్లతో కడిగి, శుభ్రపరుస్తున్నామన్నారు. ఫిల్టర్ బెడ్‌ల చుట్టూ పేరుకున్న నాచును కడిగిస్తున్నామని తెలిపారు. అనంతరం ఫిల్టర్ బెడ్‌లలో గరుక ఇసుక వేయిస్తామన్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి అయిన తరువాత ప్రజలకు రక్షిత నీరు సరఫరా అవుతుందన్నారు.



ఓహెచ్ఎస్ఆర్ వద్ద ఫిల్టర్ బెడ్ గోడలకున్న నాచును తొలగించి, శుభ్ర పరుస్తున్న దృశ్యం.

నమ్మండి.. ఇది తారు రోడ్డే !



మట్టి రోడ్డులా కనిపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారులు

కాళ్ల మట్టి రహదారుల్లా కనిపిస్తున్న ఈ రోడ్లు ఆర్ అండ్ బీ రహదారులే. ఇటీవలి కాలంలో మండలంలో ఆక్వా చెరువుల తవ్వకాలతో పాటు చేలల్లో మెరక తొలగింపు పేరిట మట్టి రవాణా ట్రాక్టర్ల రాకపోకలు పెరిగిపోవడం,అధికారులు పర్యవేక్షణ లేమితో ట్రాక్టర్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో మట్టిని తరలించారు. దీంతో రహదారులు ధ్వంసం అవుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోమటిగుంట గ్రామంలోని పలుప్రాంతాల్లో యథేచ్ఛగా మట్టి తోలకాలు ట్రాక్టర్లు, లారీలపై బరకాలు లేకుండా మట్టి తోలడంతో మట్టి రోడ్లపై పడి భారీగా పేరుకు పోయి ఆర్ అండ్ బి రోడ్లు, సీసీ రోడ్లు మట్టి రోడ్లుగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు పాడవుతున్నాయని వాహనదారులు,గ్రామస్తులు ఆరోపిస్తున్నారు . శనివారం తెల్లవారు జామున కురిసిన చిన్నపాటి వర్షానికి సీసలి నుంచి కోమటిగుంట వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారి పుంత రోడ్డులా మారి బురద మయంగా మారింది.ప్రయాణానికి వీలు లేకుండా తయారవ్వడంతో వాహనదారులు, విద్యార్థులు,ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి మట్టి పేరుకుపోయి రోడ్డంతా బురదమయమైంది . సంబంధిత మట్టి కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కాళ్ల: సామాజిక స్పృహతో విద్యను ప్రోత్సహించడం తన బాధ్యత అని విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్.పట్టాభిరామయ్య అన్నారు. ఆనందపురం పంచాయతీ మేకలదిబ్బ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా విషయక సామాగ్రిని శనివారం ఆయన పంపిణీ చేసారు. తన స్వస్థలం మేకలదిబ్బ గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ప్రతి ఏటా పుస్తకాలు ఇతర సామగ్రిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో చెల్లబోయిన యశ్వంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట వెంకటరామ్, ఉపాధ్యాయులు పాలా నాగశ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న పట్టాభిరామయ్య

ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ



పాలకోడేరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



మోగల్లులో సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న దృశ్యం (ఫైల్)

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో భరోసా
- లబ్ధిదారులకు ఇంటి వద్దే పౌష్టికాహారం పంపిణీ

పాలకోడేరు: అందరికీ ఆరోగ్యం ఇదే ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నినాదం. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. కొన్నేళ్ల కిందట గర్భిణులు, బాలింతలు పోషకాహారం తినకపోవడంతో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడేవారు. ప్రసవ సమయం, ప్రసవానంతరం రక్తహీనతతో మృతి చెందేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ప్రారంభించారు. ఈ పథకంలో గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలల వరకు నెలవారీ ఆరు రకాల పౌష్టికాహారం పదార్థాలతో కిట్ అందిస్తున్నారు. వీటితో పాటు పోషక విలువలతో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రాని వారికి రోజుకో గుడ్డు, వారానికి లీటర్ పాలు సరఫరా చేస్తున్నారు. అయితే ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రతి గర్భిణి, బాలింత అంగన్‌వాడీ కేంద్రానికి భోజనానికి రావడానికి ఇబ్బందిపడడంతో ఇకపై ఇంటికే రేషన్ ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో ఉండి, పాలకోడేరు, ఆకివీడు కాళ్ల మండలాల్లో మొత్తం 261 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి 1534 మంది గర్భిణులు, 1360 మంది, బాలింతలు ఉన్నారు.

జూలై 1 నుంచి ఇంటికే సరుకులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో కేజీరాగి(చోడి)పిండి, కేజీ చిరు ధాన్యాల పిండి, కేజీ అటుకులు, పావుకేజీ శనగ చెక్కీ, పావుకేజీ బెల్లం, పావుకేజీ ఎండు ఖర్జూరం మొత్తంగా ఆరు రకాల ఆహార పదార్థాలుంటాయి. గర్భిణులు, బాలింతలకు జూలై ఒకటి నుంచి లబ్ధిదారులు ఒక్కొక్కరికి మూడు కేజీల బియ్యం, కిలో కందిపప్పు, 450 ఎంఎల్ నూనె ఇస్తారు

అర్హులందరికీ అందజేస్తున్నాం

ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సరఫరా చేస్తోంది. వీటిని అర్హులందరికీ సకాలంలో అందజేస్తున్నాం. వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– వాణి విజయరత్నం, సీడీపీఓ,ఆకివీడు

నాణ్యత బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా ఇస్తున్న ఆరు రకాల పదార్థాలు చాలా బాగున్నాయి. సక్రమంగా వాడుతున్నాను. వీటితో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు. పౌష్టికాహారం తినడం వల్ల నా ఆరోగ్యం బాగా మెరుగుపడింది.

ఎం.సత్యవతి, బాలింత, మోగల్లు

మా ఆరోగ్యానికి భరోసా



ముఖ్యమంత్రి జగనన్న మాలాంటి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం చాలా బాగుంది. ఆరు రకాల పోషకాహారాలను అందించడం చాలా బాగుంది.

సి.ధనలక్ష్మి, గర్భిణి పాలకోడేరు

కిట్లను అందజేసి అవగాహన కల్పిస్తున్నాం



సంపూర్ణ పోషణ కిట్లను అందరూ సద్వినియోగం చేసుకుంటున్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషకాహార కిట్లు ఇస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకుంటున్నారు. లబ్ధిదారులు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జి చంద్రకుమారి, అంగన్వాడీ టీచర్ మోగల్లు

క్లుప్తంగా

ఇమ్యునైజేషన్ కార్యక్రమం పరిశీలన

వీరవాసరం: స్థానిక పీహెచ్‌సీలోని సచివాలయం-3లో నిర్వహిస్తోన్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.ఉమామహేశ్వరరావు శనివారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించి, వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్నీ సందర్శించి, గర్భిణులు, బాలింతలకు, కిషోర బాలికలకు ఇచ్చే పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఆయన వెంట వీరవాసరం మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ రాజు, హెల్త్ అసిస్టెంట్ వై.మోహన్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కాళ్లలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్య, నాడు-నేడు తో పాటు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకానికి అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని, విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలని ఎండీఎం/ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్యం నిర్వహణ పరిశీలన నిమిత్తం కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రాగి జావ, ఆకు కూర, అన్నం , టీపి పొంగలి, పప్పు చారు రుచి చూసి పిల్లలకు వడ్డించి వారితో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో ఉన్న మెనూ పదార్థాల పోషక విలువలు తెలియజేసి పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కోరారు. రికార్డులను, టాయ్‌లెట్ల నిర్వహణ పరిశీలించి ఆయాలకు తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జె.లక్ష్మీనారాయణ శాస్త్రి, ఎం.వి.సుందరమణి పాల్గొన్నారు.

దూర ప్రాంత ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ

నరసాపురం: ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్టణం వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు నరసాపురం డిపో మేనేజర్ ఎస్. సుబ్బన్నరెడ్డి చెప్పారు. ముందుగా రాను, పోను ప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకుంటే చార్జీలో రాను 10 శాతం, పోను 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో తిరుగు ప్రయాణంలో మాత్రమే రాయితీ ఉండేదని వివరించారు. అలాగే జూలై 3న గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తులకు నరసాపురం డిపో నుంచి ప్రత్యేక సర్వీస్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సర్వీస్ ద్వారా శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరిప్రదక్షణ చేసి రావచ్చని చెప్పారు. ఇక ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి ఆదివారం విశాఖపట్టణం తీసుకెళ్లి అక్కడ కైలాసగిరి, సింహాచలం, ఆర్కే బీచ్, జూపార్క్ చూపించి తీసుకువస్తామని చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థి మిస్సింగ్ కథ సుఖాంతం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో 29వ వార్డు చింతల తోటకు చెందిన మజ్జి రామ్‌తేజ్ మిస్సింగ్ కేసు సుఖాంతమైంది. శుక్రవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు చూసుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామ్‌తేజ్ రాత్రి వరకూ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఈ సమాచారాన్ని పత్రికలు, సోషల్ మీడియా, బంధువులకు చేరవేయడంతో అందరూ ఎంతో శ్రమంచి విద్యార్థి రామ్‌తేజ్ కోసం గాలించగా శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి తేజను ఇంటికి తీసుకువచ్చారు. శనివారం విద్యార్థి తండ్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పిల్లాడిని వెతకడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పెనుగొండ: రైతులకు నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. శనివారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎరువులు, పురుగు మందల డీలర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు అందించే ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీ ధరకే విక్రియించాలన్నారు. రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణాల్లో ధరలు, స్టాక్ బోర్డును రైతులకు తెలియ చేసే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులువ విక్రయించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా ముత్యాలమ్మవారి జాతర

భీమవరం అర్బన్: భీమవరం మండలం దొంగపిండి ముత్యాలమ్మవారి జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలు, బుట్టబొమ్మల కళాకారులతో, నృత్యాల నడుమ ముత్యాలమ్మవారి గరగలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వాదాలు అందుకున్నారు. వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, సర్పంచ్ బొద్దు రేవతి అమ్మవారిని దర్శించుకుఅన్నరు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తిరుమాని ధనంజయ రాజు, రేవు రాంబాబు, బొద్దు మోహన్, రేవు పూర్ణచంద్రరావు, జనార్దన్‌లు పర్యవేక్షించారు.

లయన్స్ ఆదర్శ క్లబ్‌కు అవార్డులు

ఆకివీడు: వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో ఆకివీడు లయన్స్ ఆదర్శ క్లబ్ మూడు అవార్డులు వచ్చినట్లు క్లబ్ అధ్యక్షులు ఎండీ. అహ్మద్ శనివారం విలేకర్లకు తెలిపారు. ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల నిడదవోలులో జరిగిన అవార్డుల కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ పంకజాక్షన్ చేతుల మీదుగా రెండవ ఉత్తమ క్లబ్ అధ్యక్షుడుగా తనకూ, కైలాస నిలయంలో పేదలకు ఆకలి తీర్చే హంగర్ రిలీఫ్ కార్యక్రమానికి నేరెళ్ల రామ చెంచయ్యకు ప్రోత్సాహక అవార్డుతో పాటు, అంతర్జాతీయ అధ్యక్షుల ప్రోత్సాహక అవార్డును లయన్ పల్లి అప్పిరెడ్డికి అందజేశారని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రమేష్, జాకీర్, చెంచయ్య పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు ఆపాలి

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను ఆపాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడుల నుంచి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎండీ మునవర్, గంటా రాజ్‌కుమార్, అంబటి ఆనంద్ కుమార్, మరపట్ల మునియ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం తనిఖీ

పెనుమంట్ర: మండలంలోని పొలమూరు శెట్టిబలిజ రామాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉమా మహేశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొలమూరులో ఫ్యామిలీ కాన్సెప్ట్ శిబిరాన్ని 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు మూడు రోజుల పాటు 150 మందికి పెనుమంట్ర పీహెచ్‌సీ పరిధిలో నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిలో 30 మంది భీమవరం, పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు, అవసరమైన వారికి కంటి అద్దాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువు నందు చేపలు పెంపకము చేసుకొను లైసెన్సు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలంపాట ప్రకటన

[illegible]

క్ర. సం.	భూమి ఉన్న గ్రామం	R.సర్వే నెం	విస్తీర్ణం ఎక.సెం	కౌలు కాలం	ప్రభుత్వ ధరావత్తు సొమ్ము
1	[illegible]	85/1,85/2, 85/3,85/4	3.51	[illegible]	40,000/-

[illegible]

గ్రామం : లక్షపాడు
తేది: 24.06.2023

యస్. సూర్యప్రకాశరావు
మేనేజర్, సెల్.9441235809